RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 06 | డిసెంబర్ 06, 2025 | వెల : రూ.3-00



**డిజిటల్ హింస నిర్మూలన థీమ్‌తో విద్యార్థులకు అవగాహన**

4లో..

## పేదల సంక్షేమమే ధ్యేయం

- అభివృద్ధి కూడా.. రూ.20 వేల కోట్లతో..
- ప్రతి గ్రామానికి రోడ్డు, తాగు నీరు, పాఠశాల: సీఎం రేవంత్
- నర్సంపేటలో రూ.532.24 కోట్ల పనులకు శంకుస్థాపన



**వేద న్యూస్, వరంగల్/నర్సంపేట:**

పేదవారి అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాలోని నర్సంపేట లో హెలీపాడ్‌కు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిలు చేరుకోగా, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్క, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం డి రియాజ్, ఎం పి బలరాం నాయక్, ఎమ్మెల్సీ లు బస్వరాజు సారయ్య , పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, తదితరులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటలో రూ. 532.24 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. అందులోరూ. 56.40 కోట్ల వ్యయంతో నర్సంపేట నుండి నెక్కొండ హెచ్ఎం రోడ్డు 2ఎల్ ప్లస్ పీఎస్, 4ఎల్ లైన్ల రహదారికురూ. 82.56 కోట్లతో హనుమకొండ -నర్సంపేట- మహబూబాబాద్ హెచ్ఎం రోడ్డు నాలుగు లైన్ల రోడ్డుకు నర్సంపేటలో రూ. 26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులకు, రూ.130 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య

మిగతా 3వ పేజీలో..

## రక్షణ, అంతరిక్ష రంగాల్లో ప్రైవేట్ సంస్థల ప్రవేశంతో కొత్త అవకాశాలు

- తదుపరి తరపు జీఎస్టీ సంస్కరణలు 'వికసిత భారత్' లక్ష్యానికి దోహదం చేస్తున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్య
- వ్యాపార అనుకూల వాతావరణానికి అనుగుణంగా అనుసరణ బాధ్యతల తగ్గింపు
- పౌర అణుశక్తి రంగం కూడా ప్రైవేట్ పెట్టుబడులకు తెరవనున్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ, వేద న్యూస్ :**

దేశంలో జీఎస్టీ వ్యవస్థకు సంబంధించి తదుపరి తరపు సంస్క రణలను అమలు చేయడం, అనుసరణ అవసరాలను తగ్గించడం వల్ల వ్యాపార వాతావరణం మరింత అనుకూలంగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వ్యాపారాలు నిర్వహించడంలో సరళత పెరగడం, పారిశ్రామిక వృద్ధికి ఆస్కారం పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ విధానాలు దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, రక్షణ మరియు అంతరిక్ష రంగాలను ప్రైవేట్ సంస్థలకు తెరవడం కొత్త అవకాశాలను సృష్టించిందని తెలిపారు. ఈ రంగాల్లో కొత్త స్టార్టప్‌లు, ఇన్నోవేషన్, సాంకేతిక అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రపంచ పోటీతత్వం లో భారత్ తన స్థానం బలపరచు


మిగతా 3వ పేజీలో..

## బీసీ రిజర్వేషన్ల మోసం వల్లే యువకుడు మృతి – కేటీఆర్



4లో..

- 42 శాతం హామీ ఇచ్చి 17 శాతానికి తగ్గించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- ఇది రాజకీయ వైఫల్యం కాదు, ప్రభుత్వమే చేసిన హత్య అని ఆరోపణ
- బాధిత కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్



## ఏటికి ఎదురీత ఈ పథం!

నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం వంటివి ప్రస్తుత సమాజంలో అంతగా పట్టింపు లేనివిగా మారిపోతున్నాయి.! ఈ తరుణంలో విశ్వసనీయతకు పెద్ద పీట వేస్తూ.. విలువలతో పరిధి మేరలో పని చేస్తూ 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక మూడు వసంతాలు పూర్తి చేసుకుని నాలుగో వసంతంలోకి అడుగెడుతోంది. ఈ జర్నీ 'ఏటికి ఎదురీత వంటిదే' అని చెప్పడంలో ఎలాంటి సంశయం లేదు. అన్ని వ్యవస్థలలో మార్పులు వచ్చినట్టుగానే జర్నలిజం రంగంలోనూ మార్పులొచ్చాయి. ఈ నేపథ్యంలో విలువలు, ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి..! ప్రజా సమస్యల ప్రస్తావన, ప్రచురణ.. పత్రికలకు ప్రాధాన్యత అంశంగా ఉండాలి. కానీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఎంపికలు మారిపోతున్నాయి. ఈ పూర్వరంగంలో మౌలిక నియమాలకు కట్టుబడి పాఠకులకు విశ్వసనీయమైన సమాచారం చేరవేత, వార్తా కథనాలతో కదలిక కలిగేలా, సమాజంలో చైతన్యం కలిగేలా పని చేయాలనే ఆలోచనలతో ముందుకు సాగుతుండటం ఆషామాషీ విషయం కాదు. అందులో ఆర్థిక నిర్వహణతో కూడిన ఈ వ్యవహారం నిట్టనిలువుగా ఏటికి ఎదురీగుతూ..పడుతూ..లేస్తూ.. ఆగుతూ... సాగుతూ..చేసే నావ ప్రయాణమే.! ఈ తోవలో ఎదురైన ఎన్నో అనుభవాలు మరింత ముందుకు సాగేందుకు తోడ్పాటునిచ్చే అంశాలూగానే భావిస్తున్నాము.

ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా పత్రికలో వార్తలను ప్రముఖంగా ప్రచురణకు స్థానమివ్వాలనే నైతిక నియమావళికి కట్టుబడిన 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ఈ మూడేండ్ల కాలంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. ముఖ్యంగా ఆర్థికపరంగా కొట్టుమిట్టాడిన సందర్భంలో పాఠకుల మద్దతు అపూర్వం. క్షేత్రస్థాయిలో సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణకు 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలోనే తన ప్రయాణంలో ఎన్నో అంతర్ దృష్టి కలిగిన వార్తా కథనాలను పరిశీలనాత్మకంగా, పరిశోధనాత్మకంగా, క్షేత్రస్థాయి పరిశీలన చేసి మరీ ప్రచురించింది. పాఠక లోకం నుంచి అలాంటి కథనాలకు విశేష ఆదరణ లభించింది. కానీ, బాధిత పక్షం కోసం 'వేద న్యూస్' గళమైన సందర్భంలోనూ ప్రేక్షకపాత్ర పోషించి.. కనీసంగా చైతన్యాన్ని ప్రదర్శించలేని స్థితిలో నిస్సహాయతను ఆ వర్గం ప్రదర్శించింది .! అయినా మొక్కవోని ధైర్యంతో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా బాధ్యతాయుతమైన పాత్రను శక్తివంచన లేకుండా పోషించింది. ఇక ఈ కష్టతరమైన జర్నీలో కొంత మేరకైనా మాకు అండగా నిలిచిన వారిని మాత్రం మరిచిపోలేం. పాఠకుల అండదండలతో 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక అక్షర యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తాం.

అంబీర్ శ్రీకాంత్,
'వేద న్యూస్' తెలుగు దినపత్రిక,
కార్యనిర్వాహక సంపాదకులు,
సెల్:81859 68059.

వేద న్యూస్

శనివారం డిసెంబర్ 06, 2025


# జీవవైవిధ్య ప్రతీకలు.. రంగుల రాణులు



- అందమైన కీటకాలు.. 'సీతాకోక చిలుకలు'
- ఏటూరునాగారం అభయారణ్యంలో సుమారు 85 జాతులు
- అరుదైన సీతాకోకచిలుకలను గుర్తించిన పరిశోధకులు
- ఔల్స్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్, బీసీఎస్, మోత్ సొసైటీ ఆఫ్ తెలంగాణ సర్వే

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సృష్టిలో మరే జీవికి లేని అందం 'సీతాకోకచిలుకల' సొంతం అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకేనేమో అతివలను, పచ్చని ప్రకృతి అందాలను సీతాకోకచిలుకలతో పోలుస్తుంటారు. అందమైన ఈ కీటకాలను 'రంగుల రాణులు' అని కూడా పిలుస్తారు. ప్రకృతి అందాలను మరింతగా ఇనుమడింపజేసే సౌందర్యం వీటి సొంతం. జీవవైవిధ్యానికి ప్రతీకలుగా ఇవి నిలుస్తున్నాయి. ఇటీవల ఔల్స్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్, బీసీఎస్, మోత్ సొసైటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఏటూరునాగారం అభయారణ్యంలో బట్లర్ ఫ్లై, మాత్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సుమారు 80కి పైగా జాతులను గుర్తించినట్లు పరిశోధకులు వెల్లడించారు. ఈ సర్వేలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 60 మందికి పైగా పరిశోధకులు చిత్ర చాయాగ్రహకులు పర్యావరణవేత్తలు పాల్గొన్నారు. తెలంగాణలో 150కి పైగా సీతాకోక చిలుకల జాతులు ఉండగా..ఏటునాగారం వైల్డ్ లైఫ్ శాంక్చువరీ లోనే 80 రకాలకు పైగా సీతాకోక చిలుకల జాతులుండటం విశేషమని పేర్కొన్నారు.





**- పచ్చని ప్రకృతికి మరింత అందాన్ని అద్దుతూ..**

పచ్చని ప్రకృతికి మరింత అందాన్ని అద్దుతున్నట్టు రకరకాల జాతుల సీతాకోకచిలుకల జాతులు ఏటూరునాగారం అభయారణ్యంలో ఉన్నాయి. సాధారణంగా గృహాల్లో ఉండే సీతాకోకచిలుకలు మకరాందాన్ని సేవిస్తు.. కామన్‌గా కనిపిస్తుంటాయి. అయితే, అందుకు భిన్నంగా అరుదైన జాతుల బటర్‌ఫ్లైస్ బ్లాక్ రాజా (టానీ రాజా), కామన్ బాండెడ్ పీకాక్ తదితరాలు పరిశోధకులకు సర్వేలో కనిపించాయి. జీవ సూచికగా 'సీతాకోకచిలుకలు' నిలుస్తున్నాయని పర్యావరణవేత్తలు వివరించారు. సీతాకోకచిలుకలు తేనేను సేకరించుకునే క్రమంలో పువ్వులో మకరందాలు పుప్పొడి రేణువులు పుష్పం కీలాగ్రం చేరుకుని ఫలదీకరణం జరిగి గింజలు పడి.. స్వపరాగ సంపర్కం, పరపరాగ సంపర్కం జాతులు ఏర్పడటంలో కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు.


**- పర్యావరణ సమతుల్యతలో కీ రోల్**


పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషించే సీతాకోకచిలుకలు ప్రపంచంలో 17,500 జాతులున్నాయని, అందులో భారతదేశంలో 1,500కి పైగా జాతులుండగా, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 170కి పైగా జాతులుండగా, తెలంగాణలో 140కిపైగా జాతులున్నాయి. ఇందులో ఏటూరునాగారం దండకారణ్యంలో సుమారు 80కిపైనే బటర్ ఫ్లైస్ జాతులున్నట్టు ఇటీవలి సర్వేలో తేలింది. మొత్తంగా 94 రకాల బటర్ ఫ్లై జాతులని మొన్నటి సర్వేలో గుర్తించారు. పెరుగుతున్న కాలుష్యం, అడవులకు ఆటంకం కలిగిస్తున్న సందర్భాల్లో వివిధ రకాల జీవులు అంతరిస్తున్నాయి. తెలంగాణలో ఇప్పటివరకు అధికారికంగా 140 జాతుల సీతాకోకచిలుకల గుర్తింపు రాగా, అనధికారంగా 200 కుపైగా ఉన్నాయని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ద్వారా తెలిసింది. 93 ప్లస్ ట్రీ ఫ్లిటర్ కలుపుకుని మొత్తం 94 జాతులు ఏటూరునాగారం అభయారణ్యంలో ఉన్నాయి. హయారోటిస్ అడ్రాస్టస్, చెట్టు ఫ్లిటర్, దక్షిణాసియా, ఆగ్నేయాసియాలో కనిపించే హెస్పెరిడే కుటుంబానికి చెందిన సీతాకోకచిలుక ఏటూరునాగారం దట్టమైన అరణ్యంలో ఉన్నాయి. సీతాకోకచిలుకలు ఒకవేళ అంతరించిపోతే మానవాళికి ఆహారం దొరకని సందర్భాలు వస్తాయని కొందరు పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీతాకోకచిలుకలతో పాటు వివిధ వన్యప్రాణులు, అడవుల సంరక్షణకు ప్రభుత్వాలు పకడ్బందీగా చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.














# గ్రామాభివృద్ధియే లక్ష్యం

- ఆశీర్వదించి.. అవకాశమిస్తే.. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా
- గడ్డివానిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డి శ్రీనివాస్

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



ప్రజా సేవే లక్ష్యంగా.. గ్రామాభివృద్ధియే ధ్యేయంగా తాను గ్రామ సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేశానని గడ్డివానిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన టేకుర్తిలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. సేవే లక్ష్యంగా ముందుకొచ్చిన తనను ఆశీర్వదించి అవకాశం ఇవ్వాలని గడ్డివానిపల్లి గ్రామ ప్రజలను శ్రీనివాస్ అభ్యర్థించారు. విద్యావంతుడినైన తాను గ్రామాభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా పని చేస్తానని చెప్పారు.

# సర్పంచ్ అభ్యర్థి గుండెపోటుతో ఆకస్మిక మృతి!

- ప్రజా సేవ కల నెరవేరకముందే కన్నుమూత

**వేద న్యూస్,వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం, చింతల్‌టాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెర్ల మురళి గుండెపోటుతో కన్నుమూశారు. ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తూ ఎంత ఉత్సాహంగా నిన్నటి వరకు ప్రచారం నిర్వహించిన చెర్ల మురళి, గ్రామస్తులకు ప్రజాసేవ చేసేందుకు ఎన్నో కళలు కన్నారు. గ్రామాభివృద్ధికి మెరుగైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్న మురళి అర్ధాంతరంగా మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# బహుజనుల సేవకుడు శ్రీనివాస్

- ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి..
- తనను ఆశీర్వదించి అవకాశమివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి
- గ్రామ సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసిన గడ్డి శ్రీనివాస్

**వేద న్యూస్, ఇల్లందకుంట:**




ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన యువనాయకుడు అతను.. అందరివాడుగా పేరు గాంచి గ్రామ ప్రజల ఆత్మబంధువుగా.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపే నేత ఆయన. అందరివాడుగా పేరు గాంచిన సదరు వ్యక్తి గ్రామ ప్రథమ పౌరుడిగా బరిలో నిలిచారు. తనను ఆశీర్వదించి సర్పంచ్‌గా ఒక్కాసరి అవకాశం ఇవ్వాలని, గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని గడ్డివానిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డి శ్రీనివాస్ పేర్కొంటున్నారు.

**సమస్యలపై అవగాహన ఉన్న విద్యావంతుడు**

క్షేత్రస్థాయిలో సమస్యలపై అవగాహన ఉన్న విద్యావంతుడు, ఇల్లందకుంట మండల పరిధిలో ప్రజల్లో, అన్ని వర్గాల్లో చక్కటి పేరు సంపాదించుకున్న వ్యక్తి గడ్డివానిపల్లివాసి గడ్డి శ్రీనివాస్. ఎంఏ.. బీఈడీ చదువుకున్న ఉన్నత విద్యావంతుడు.. అంతే కాదు గతంలో గ్రామానికి సంబంధించి పలు సమస్యల పరిష్కారానికి ఆయన పోరాడారు. గ్రామప్రభుత్వ పాఠశాలకు సంబంధించి ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక అంగన్ వాడీ టీచర్, ఆయాను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామంలో ప్రభుత్వ వైద్యుల చే వైద్య శిబిరం నిర్వహించేలా తన వంతుగా ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడ్డారు.

**ప్రజాసేవలో ముమ్మందుకు..**




ప్రజాసమస్యలపైన చక్కటి అవగాహన కలిగి.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే గడ్డి శ్రీనివాస్‌ను సర్పంచ్‌గా ఎన్నుకోవడం ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు అనంతరం అభ్యర్థి గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాను ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ప్రజాసేవలో అందరి ఆశీస్సులు పొంది ముమ్మందుకు వెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. అందరివాడుగా సమస్యల పరిష్కారంలో.. ప్రతీ విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసి.. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వెల్లడించారు.

# జై భవాని జై సేవాలాల్ భోగ్ బండార్

**వేద న్యూస్, వెల్దుర్తి:**



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం చెర్లపల్లి తండా లో జై భవాని జై సేవాలాల్ జై రామారావు మహారాజ్ గారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని గురువారం నాడు భవాని మాత బోనాలు తీయడం జరిగింది. శుక్రవారం నాడు గుడి ఆలయంలో పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భవాని మాత ఆశీస్సులు మాకు ఎల్లప్పుడూ ఉండాలని తాండవాసులు ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు. ప్రతి సంవత్సరం మేము భవాని మాత మాల వేసుకోవడం జరుగుతుంది. కాబట్టి మాకు అంత భవాని మాత గారి ఆశీస్సులు మాకు నమ్మకం ఉంది కాబట్టి మేము అమ్మవారి ఆశీస్సులతో మా కుటుంబంలో మా తాండలో అందరికీ మంచి జరగాలని మేము అందరమూ కోరుకుంటున్నాము. తండా గుడి పూజారి బానోత్ మంజ, సకేతావత్ శ్రీను మరియు తండా పెద్ద మనసులు నాయక్ సురేష్, కర్బరి హరిచంద్ మా అందరి ఆశీస్సులతో నాకు సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, భవాని మాత ఆశీస్సులతో కేతవత్, దుర్గ్య నేను చర్ల పల్లి గ్రామ పంచాయతీ ప్రజలకు రుణ పడి ఉంటానని అందరికీ అభినందించారు.

# ముచ్చట్ల రచ్చబండ 'సాంబు'

- ☐ అందరి ఫేవరెట్ డిస్కషన్ అడ్డా ఈ హోటల్
- ☐ స్థానిక ఎలక్షన్స్ నేపథ్యంలో ఫుల్ బిజీగా ఈ ప్లేస్
- ☐ వేడి వేడి చాయ్ తాగుతూ.. ఎన్నికల వ్యూహాలు
- ☐ సుమారు 20 ఏండ్లకుపైనే చరిత్ర ఉన్న హోటల్..
- ☐ పలువురికి నిత్యం ఇదే అడ్డా.. చర్చాగోష్టి పాయింట్



**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

"అన్నా.. ఏడున్నవ్.. నిన్ను అర్జెంట్‌గా కలవాలె.. నీతోటి ముఖ్యమైన ముచ్చట మాట్లాడాలె.." ఓ తాజా మాజీ ప్రజాప్రతినిధికి కాన్ఫరెన్స్‌లో సర్పంచ్ అభ్యర్థి, అతని అనుచరుడు ఫోన్‌లో అడిగారు. "కొంచెం బిజీగా ఉన్నా.. తర్వాత కలుద్దాం.. తీయ్" అని అవతలి వైపు నుంచి స్పందన వచ్చింది. "అరె.. గట్ల కాదు అన్న.. చానా ముఖ్యమైన డిస్కషన్ నీ తోటి చెయ్యాలె.. జర టైం.. ఇవ్వు" అని ఇవతలి వైపు నుంచి మరోసారి రిక్వెస్ట్ చేశారు. దాంతో ఇక తప్పేటట్లు లేదు అన్నట్టు కదా.. అని ముక్తాయింపుగా సదరు లీడర్ "సాంబు హోటల్‌కు రండి" అని చెప్పి.. కాల్ కట్ చేస్తున్న.. అని చెప్పే లోపు.. "పెద్దన్నా.. మేము సాంబు హోటల్ కాడనే ఉన్నాం" అని వాళ్లు చెప్పారు.. అలా..వాళ్లు సాంబు హోటల్‌కు వచ్చేశారు. ఇక అప్పటికే ఆ హోటల్‌కు వచ్చిన వాళ్లు అందరూ ముచ్చట్లలో మునిగిపోయారు. మొత్తంగా జిల్లా వాసుల సరదా, సీరియస్ ముచ్చట్లకు కేరాఫ్‌గా కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రచ్చబండగా కొనసా..గుతున్న "సాంబు హోటల్"పై 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనమిది..




**ప్రైమ్ ప్లేస్‌లో.. ముచ్చట్లకు వేదికగా..**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో దాదాపు 20 ఏళ్ల పై చరిత్ర కలిగిన సాంబు హోటల్ జిల్లావాసులకు చర్చా వేదికగా నిలుస్తోంది. ఆసిఫాబాద్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ఈ హోటల్‌లో నియోజక వర్గ, మండల స్థాయి నాయకులు, అధికారులు, జర్నలిస్టులు నిత్యం పలు విషయాలపై ఇక్కడే చర్చలు జరుపుతారు. చర్చా వేదికగా కొనసా..గుతున్న ఈ హోటల్‌కు అన్ని ప్రభుత్వ కార్యాలయలకు చేరువలో ఉండటం విశేషమనే చెప్పొచ్చు. అందుకేనేమో.. ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లీడర్లు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులతో పాటు ఆఫీసర్లు సైతం ఈ హోటల్‌కు నిత్యం కస్టమర్లుగా వస్తుంటారని పేర్కొనవచ్చు.

**అందరి అడ్డాగా..**

సదరు సాంబు హోటల్‌కు సమీపంలోనే.. కలెక్టరేట్, ఎస్పీ , జిల్లా కోర్టు, ఆర్డీవో, తహసీల్దార్, అగ్నిమాపక కేంద్రం తదితర ప్రభుత్వ కార్యాలయాలకు చేరువలో ఉన్నాయి. ఈ క్రమంలోనే లీడర్లు, అధికారులు, లాయర్లు, జర్నలిస్టులు ఇలా అని వర్గాల వారు కలిసే అడ్డాగా, చర్చావేదికగా కొనసాగుతోందని ఓ జర్నలిస్టు వెల్లడించారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు నిత్యం.. ఇక్కడికి వచ్చి ఎన్నికల గెలుపు వ్యూహాలు, బుజ్జగింపులు తదితర అంశాలపై చర్చలు కొనసాగిస్తున్నారు. ఈ సాంబు హోటల్‌కు రాకపోతే తమకు పొద్దుపోదు అనే వారు సైతం కొందరు ఉన్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నిత్యం ఇదే వారి అడ్డాగా, చర్చాగోష్టి పాయింట్‌గా మార్చుకుని.. వేడి వేడిగా చాయ్.. తాగుతూ..అలా సరదా కబుర్లతో పాటు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి రాజకీయాలపైన వ్యాఖ్యానిస్తుంటారు. ఒక్కో సందర్భంలో తాము కలవాలనుకునే లీడర్లో, జర్నలిస్టులో, ప్రముఖులో ఎక్కడా దొరకకపోతే.., సాంబు హోటల్ వద్దకు వచ్చి వెతికితే దొరకొచ్చని ఓ నేత పేర్కొన్నారు. చాలా కాలంగా తాము ఈ హోటల్ వద్ద తమకు సంబంధించిన పలు విషయాలపై రకరకాల సానుకూల చర్చలు జరుపుతూ.. నిత్యం హోటల్‌కు వస్తుంటామని ఓ విలేకరి చెప్పారు. వార్తల సేకరణతో పాటు లీడర్ల అభిప్రాయాలు, వాయిస్ ఇతర విషయాలపైన ఇక్కడ చర్చించేందుకు వాళ్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఆశీర్వదించి.. అవకాశమివ్వండి

- గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా..
- పాపయ్యపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గుండెకారి సరోజన



**వేద న్యూస్, జమ్మికుంట:**

గ్రామ ప్రజలు ఆశీర్వదించి.. గ్రామ సర్పంచ్‌గా తనకు అవకాశమిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని పాపయ్యపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గుండెకారి సరోజన పేర్కొన్నారు. శుక్రవారం ఆమె సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ శ్రేయస్సే ధ్యేయంగా ముందుకెళ్తామని చెప్పారు. ప్రజాసేవ కోసమే తాను బరిలో నిలిచానని, అందరి శ్రేయస్సు, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని వెల్లడించారు.

## ఇంటింటా కాంగ్రెస్ పార్టీ జోరుగా ప్రచారం

**వేద న్యూస్, రుద్రూర్:**



స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇందూరి సునీత –చంద్రశేఖర్ సర్పంచ్ బరిలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇంటింటా తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ పత్రాలను చూయిస్తూ ఉంగరం గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం

కళాశాల మరియు వసతి గృహముల నిర్మాణ పనులకు, రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు, నర్సంపేట పట్టణంలో రూ. 20.కోట్లతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, బీటీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, రూ.17.28 కోట్ల వ్యయంతో నర్సంపేట నుండి పాకాల హెచ్ఏఎం రోడ్డు 2ఎల్ ప్లస్ పీఎస్ లైన్ల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

– పేదల ఆకలి తీరుస్తున్నాం

అనంతరం జరిగిన ప్రజా పాలన విజయోత్సవ వారోత్సవాల బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల తో ప్రతి గ్రామానికి రోడ్డు తాగునీరు, పాఠశాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఇరిగేషన్ కమ్యూనికేషన్ కు ప్రాధాన్యత ఇస్తూ ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం 3 కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్‌ను స్ఫూర్తిగా తీసుకుని పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ చీరల పంపిణీ కోడ్ ముగిసిన వెంటనే 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు అందేలా స్వయంగా తానే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. ఈ చీరలు గ్రామాల్లో మహిళలకు చేర్చే బాధ్యత మంత్రులు తీసుకోవాలని సూచించారు. పేదల ఆత్మ గౌరవాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం లో నర్సంపేట నియోజకవర్గంలో మరో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. 60 వేలకుపైగా ఉద్యోగాల భర్తీతో పాటు ఇచ్చిన హామీలను ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న సౌకర్యాలు, అభివృద్ధి అవకాశాలు వరంగల్‌కూ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మార్చి 31 లోగా వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అలాగే వరంగల్‌లో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నట్లు కూడా చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఇచ్చిన హామీ మేరకు పేదవారి కోసం ముఖ్యమంత్రి గడిచిన 2 సం.లలో ప్రతిసంక్షేమ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారని అన్నారు. స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించిన నర్సంపేట పై వరాల జల్లు కురిపించడం పై ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్, తో పాటు రూ.154 కోట్ల తో మెడికల్ కళాశాల ను ఏర్పాటు చేయడం జరిగిందని కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు.

# మలబద్ధకానికి ఇలా చెక్

- ఈ నెల 1 నుంచి 31 వరకు అవగాహన నెల
- డాక్టర్ ఊడుగుల సురేశ్ ముఖ్యమైన సూచనలు

**వేద న్యూస్, జమ్మికుంట:**

మలబద్ధకం(కాన్స్టిపేషన్) అనేది మలవిసర్జన ఆలస్యం కావడం లేదా అసంపూర్ణంగా రావడం వంటి లక్షణాలతో కనిపించే సమస్య. కానీ, దీనిని నిర్లక్ష్యం చేస్తే పైల్స్, ఫిషర్లు వంటి అనారోగ్య సమస్యలకు దారి తీయొచ్చని నిపుణులు వివరిస్తున్నారు. ఈ నెల(డిసెంబర్) 1 నుంచి 31 వరకు మలబద్ధకంపై అవగాహన కల్పించే నెల కావడంతో.. ప్రజలకు మలబద్ధకం నివారణ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన పేగు అలవాట్లు, సమయానికి సరైన చికిత్స గురించి ప్రముఖ వైద్యుడు, గోల్డ్ మెడలిస్ట్, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. ఆ ముఖ్యమైన సూచనలు మీ కోసం

**ఈ అలవాట్లు అనుసరించండి**

మలబద్ధకం నివారణకు ప్రతీ రోజూ కనీసం 2 నుంచి 3 లీటర్ల నీరు తాగాలని, ఆహారంలో ఫైబర్ అధికంగా ఉన్న పదార్థాలు (గోధుమ రొట్టె, పప్పులు, కూరగాయలు, పండ్లు) ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్ సురేశ్ చెప్పారు. టీ, కాఫీ, జంక్–ఫుడ్ తగ్గించాలని, నిత్యం నడక, వ్యాయామం చేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు.టాయిలెట్ ఆపకుండా సమయానికి వెళ్లడం,లూస్ దుస్తులు, ఒత్తిడి లేకుండా ఉండే జీవనశైలి కలిగి ఉండాలన్నారు. 2 – 3 రోజుల్లో మల విసర్జన లేకపోవడం, మలం గట్టిగా, రాళ్లలాగా బయటకు రావడం, విసర్జన సమయంలో ఒత్తిడి పెట్టాల్సి రావడం,కడుపు నిండినట్టు, బరువుగా అనిపించడం, తినిన తర్వాత ఫూలింగ్, గాలి ఎక్కువగా రావడం, చిన్నపాటి రక్తస్రావం వంటివి చీలిక (ఫిషర్) లక్షణాలు అని, ఇవి ముందస్తుగా మలబద్ధకం సమస్యగా గుర్తించాలని సూచించారు. ఈ లక్షణాలుంటే వైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.

**ఇవి ఆరోగ్యకరమైన పేగు అలవాట్లు**

ఉదయం లేచిన వెంటనే ఒక గ్లాస్ వెచ్చని నీరు తాగాలని, ప్రతీ రోజూ ఫైబర్ 25 నుంచి 30 గ్రాములు తీసుకునే అలవాటు చేసుకోవాలని డాక్టర్ సురేశ్ వెల్లడించారు. పప్పులు, పండ్లు (పపయ,సీతాఫలం,అరటి),ఓట్స్, మొలకలు తీసుకోవాలన్నారు. ఉదయం రొటీన్ ఫిక్స్ చేసుకోవడం (టాయిలెట్ టైమ్) మంచిదన్నారు. ఎక్కువసేపు ఫోన్, పుస్తకం పట్టుకొని టాయిలెట్‌లో కూర్చోకూడదని, అవసరమైతే డాక్టర్ సూచనతో స్టూల్ సాఫ్టనర్ / లాక్సేటివ్ వాడాలని చెప్పారు. ఒత్తిడి, ఆందోళన తగ్గించు కోవాలని చెప్పారు.



# రక్షణ, అంతరిక్ష రంగాల్లో ప్రైవేట్ సంస్థల ప్రవేశంతో కొత్త అవకాశాలు

కోగలదని సూచించారు. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడకుండా, దేశీయ పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఈ నిర్ణయాలు కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా, పౌర అణుశక్తి రంగాన్ని కూడా ప్రైవేట్ రంగానికి తెరవడానికి సిద్ధమవుతున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఇది కేవలం పరిపాలనా సంస్కరణ మాత్రమే కాకుండా, ఆలోచనా విధానంలో జరుగుతున్న పెద్ద మార్పుకు ప్రతీక అని పేర్కొన్నారు. శక్తి రంగంలో ఆధునిక టెక్నాలజీ, పెట్టుబడులు, పరిశోధనలు పెరగడంతో దేశ ఆర్థిక శక్తి మరింత బలపడే అవకాశముందని వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణలన్నిటి వెనుక ఉన్న ఏకైక లక్ష్యం 'వికసిత భారత్' సాధన అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు మాత్రమే కాదు, ప్రజల ఆలోచనలో కూడా మార్పు అవసరమని, కొత్త భారత నిర్మాణం కోసం సమిష్టి కృషి అవసరమని చెప్పారు. వచ్చే దశాబ్దాలు అభివృద్ధి, ఆధునికీకరణ, ప్రపంచ నాయకత్వం లక్ష్యంగా దేశం ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## మహనీయుల చరిత్ర భావి తరాలకు స్ఫూర్తి

**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి :**



– ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

మహనీయుల చరిత్ర భావి తరాల కు స్ఫూర్తి కలిగిస్తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం జిలా కేంద్రం లోని పిల్లల ఉద్యా నవనంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర చలన చిత్రం వాల్ పోస్టర్ ను చిత్ర యూనిట్, నాయకులతో కలిసి ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరు డైన తొలి ఉద్యమకారుడు దొడ్డి కొమురయ్య అని అలాంటి మహనీయుల చరిత్రను సినిమా రూపం లో ప్రపంచానికి తెలిసేలా నిర్మిస్తున్న చిత్ర యూనిట్ ను అభినందించారు. జిల్లా నుండి దాదాపుగా 26 మంది సహా నిర్మాతలుగా చేర్చుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం గొప్ప విజ యం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సకోల సరస్వతీ, జీవన్, శ్రీనివాస్, అలిబిన్ అహ్మద్, సినిమా దర్శక నిర్మాతలు,యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొనారు.

## ఎన్నికల మొదటి విడత శిక్షణ కార్యక్రమం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండలం జెడ్పిహేచ్ఎస్ లో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పిఓ ప్రొసీండింగ్ ఆఫీసర్ లకు మొదటి విడత ఎన్నికలకు సంబందించి పిఓ లకు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పలు సూచనలు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా సత్య ప్రసాద్ మాట్లాడుతూ, సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల నియమ నిబం ధనలను అనుసరించి పి ఓ ప్రొసీడింగ్ అధికారులు నిర్వహించాలని, సూచించారు. ఓటర్ ఓటు వేసే విధానం గురించి సమగ్రంగా వివరించారు. ప్రతి ఓటరు ఎడమ చేయి చూపుడు వేలుకు ఇంకు తప్పనిసరిగా పెట్టాలని, తద్వారా మరో ప్రాంతంలోని పోలింగ్ బూతులో ఓటు వేయకుండా నివారణ చేయబడుతుందని, సర్పంచ్, వార్డు సభ్యులకు వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు ఉంటాయని వాటిని ఓటర్లకు వివరించాలని పిఓ లకు సత్య ప్రసాద్ వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడివో గణేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్
శనివారం డిసెంబర్ 06, 2025

# సీఎం పర్యటన సందర్భంగా పటిష్ఠ భద్రత

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్
- ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ప్రత్యేక స్థలాలు ఏర్పాటు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవరకొండ పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్, సభా ప్రాంగణం, విఐపి పార్కింగ్, పబ్లిక్ పార్కింగ్ లను పరిశీలించి ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. సీఎం పర్యటనలో భాగంగా బందోబస్తుగా ఒక ఎస్పీ, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 36 మంది సిఐలు, 115 మంది యస్.ఐతో కలిపి మొత్తం 1250 మందితో పటిష్ట బందోబస్తు, భద్రతా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రేపటి సభకు ఎలాంటి వాంఛనీయ సంఘటన జరగకుండా హెలిపాడ్ నుండి కాన్వాయ్ లో పబ్లిక్ మీటింగ్ కి వచ్చే వరకు బందోబస్తును రోడ్ ఓపెనింగ్ పార్టీలు, రోఫ్ పార్టీలు, పెట్రోలింగ్ టీములు, ట్రాఫిక్ డైవర్షన్, పికేటింగ్, రూఫ్ టఫ్ సెంట్రి లు, బాంబ్ స్క్వాడ్ %డ% డాగ్ స్క్వాడ్ టీములు, క్విక్ రెస్పాన్స్ టీములు, పార్కింగ్ బందోబస్తును ఏర్పాటు చేసి సెక్టార్లుగా విభజించి,ఆయా సెక్టార్ల కు డీఎస్పీలను ఇన్‌చార్జీలుగా నియమించడం జరిగిందన్నారు. పబ్లిక్ మీటింగ్ కి వచ్చే ప్రజలకు వి.ఐ.పి లకు ప్రత్యేకంగా ఏడు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగ



కుండా ప్రవేశ మార్గాలు అనుగు ణంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.అనంతరం బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి పోలీస్ అధికారులకు బందోబస్తు గురించి పలు చూచనలు తెలిపుతూ సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశలలో అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వర్తించే సమయంలో సంయ మనం పాటించాలని పక్కాగా విధులు నిర్వర్తించాలని ముఖ్యంగా పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని,సభ పూర్తి అయ్యేవరకు పటిష్ఠ భద్రత కల్పించాలని ఆదేశించారు.

# డిజిటల్ హింస నిర్మూలన థీమ్‌తో విద్యార్థులకు అవగాహన

- అదనపు ఎస్పీ ఎస్. మహేందర్
- ప్రతి విద్యార్థి మరో ముగ్గురికి అవగాహన కల్పించాలి

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

మెదక్ మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ ఆదేశాల మేరకు, మెదక్ బాయ్స్ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్ భరోసా సిబ్బందిచే నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలపై లింగ ఆధారిత హింస నిర్మూలన కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 16-రోజుల కార్యక్రమంలో భాగంగానే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు అదనపు ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా నిర్ణయించిన 'డిజిటల్ హింస నిర్మూలన' థీమ్‌ను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు డిజిటల్ భద్రత, బాధ్యతాయుత ఆన్‌లైన్ ప్రవర్తనపై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోషల్ మీడియా మరియు డిజిటల్ వేదికలపై మహిళలు, పిల్లలు ఎదుర్కొనే ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అత్యంత కీలకమని అదనపు ఎస్పీ అన్నారు. ఆన్‌లైన్ హరాస్మెంట్, సైబర్ మోసాలు, లైంగిక దోపిడీ, అసభ్యకర కంటెంట్ ప్రాచుర్యం, ఇంపర్సనేషన్, స్టాకింగ్, ట్రాకింగ్, ఫోటో మోర్ఫింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డిజిటల్ బ్లాక్‌మెయిల్ వంటి పలు రకాల సైబర్ నేరాల గురించి



విద్యార్థులకు వివరించారు. డిజిటల్ హింసను నివారించడంలో చట్టపరమైన అవగాహన, ముందస్తు జాగ్రత్తలు, సురక్షిత డిజిటల్ ప్రవర్తన అత్యంత అవసరమని అదనపు ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్‌లో ఏవైనా అనుమా నాస్పద చర్యలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. మహిళలు మరియు పిల్లల భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూల దిశలో వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి విద్యార్థి కనీసం మరో ముగ్గురికి ఈ అవగాహనను పంచాలని అదనపు ఎస్పీ మహేందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, జూనియర్ కళాశాలలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మలయ్య, బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మలేష్, మెదక్ టౌన్ ఎసై అమర్, భరోసా ఎసై సూచిత, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా లీగల్ అడ్వైసర్ శ్వేతా, సైబర్ క్రైమ్ సిబ్బంది, సయ్యద్, సతీష్, సాయి కిరణ్, పాల్గొన్నారు.

# చదువుతోపాటు ఆటలోనూ రాణించాలి

- క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి
- ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్,తంగళ్ళపల్లి:**

విద్యార్థులు చదువుతోపాటు ఆటలోనూ రాణించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయం వార్షిక ఆటల పోటీలు 2025 - 26 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరు కాగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వాగతం పలికారు. ఆటల పోటీల జెండాను ఆవిష్కరించి, ప్రారంభించారు. విద్యార్థుల నృత్యాలు, ప్రదర్శనలు అలరించాయి.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలని పిలుపు ఇచ్చారు. విద్యార్థులు ఆన్లైన్ గేమ్స్ ఆడవద్దని, ప్రతి రోజు గంట పాటు ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలు, యోగా సాధనతో శారీరక, మానసిక సమతుల్యత, అభివృద్ధి



సాధ్యమని వివరించారు. తరగతి గది పుస్తకాలతోపాటు లైబ్రరీ లోని ఇష్టమైన పుస్తకాలు, దిన పత్రికలు చదవాలని పేర్కొన్నారు. వివిధ అంశాలపై అవగాహన వస్తుందని వివరించారు. గత ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలని సూచించారు. దీంతో వార్షిక, పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులువు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేషా ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్రివిధ దళాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**




దేశ రక్షణకు ప్రాణాలను ఫణంగా పెట్టి అహర్నిశలు కృషి చేస్తున్న త్రివిధ దళాలకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ నెల 7న నిర్వహించనున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పుర స్కరించుకొని జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె త్రివిధ దళాలకు బాసటగా డొనేషన్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రివిధ దళాలు ఎల్లా వేళలా దేశాన్ని సంంక్షిస్తున్నందునే అందరూ ప్రశాంతంగా బ్రతుకగలుగుతున్నా మని, అలాంటి సైనికలకు సహకారం అందిండంలో ప్రతి ఒక్కరు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. త్రివిధ దళాల సైనికులకు బాసటగా నిలిచేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.జిల్లా సైనిక సంక్షేమ అధికారి టి .వనజ, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ అసోసియేషన్ అధ్యక్షులు కే. భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ రాజు, సభ్యులు శ్రీనయ్య ,రాములు తదితరులు ఉన్నారు. ముందుగా ఎన్ సి సి క్యాడేట్లు, స్కౌట్ గైడ్స్ క్యాడెట్లు జిల్లా కలెక్టర్ కు డ్రమ్స్ తో స్వాగతం పలికారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు సాయుద దళాల దినోత్సవ సూచికగా బ్యాడ్జిని అలంకరించగా, జిల్లా కలెక్టర్, దళాల సహకారార్థం నిధులను డొనేట్ చేశారు.

# అవినీతి డాక్టర్లను ఉద్యోగం నుండి రిమూవ్ చేయాలి

**వేద న్యూస్,కరీంనగర్:**

కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన రూ.4.50 కోట్ల అవినీతి, అక్రమాలపై విచారణ జరిగి 20 రోజులు అవుతున్నా కారకులైన వైద్యుల పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని, అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్లకు ఏఐ ఎఫ్ బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ శుక్రవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. వారికి ట్విట్టర్, వాట్సాప్ ,వారి కార్యాలయాలకు పోస్టు ద్వారా లేఖలు పంపించినట్లు తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా కరీంనగర్ ఉమ్మడి జిల్లాకే తలమానికమైన ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగున్నర కోట్ల కుంభకోణం జరిగితే ఇప్పటి వరకు మంత్రులు పట్టించుకోకపోవడం శోచనీయమని తెలిపారు. పెద ప్రజలు ఉపయోగించుకునే ఆసుపత్రిలో అవినీతి జరిగిన పట్టించుకోరా అని ప్రశ్నించారు. అవినీతి డాక్టర్ లను కాపాడేందుకు పెద్ద ఎత్తున లభింగ్ చేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వలకు చెందిన రూ. 4,50,00,000 దుర్వినియోగం చేయడం వంటి కుంభకోణంలో పాల్గొన్న డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ అజయ్ ప్రసాద్, డాక్టర్ నవీన, డాక్టర్ మొహమ్మద్ అలీమ్, డాక్టర్ రత్నమాల, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జ్యోతి పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఎంక్వైరీ చేసిన రిపోర్టును మళ్ళీ ఎంక్వైరీ చేయడానికి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారులు, జిల్లా డీఎంహెచ్వో, ఇతర అధికారులు పూర్తిస్థాయిలో రూ.4.50 కోట్ల అవినీతిపై ఎంక్వైరీ చేయడం జరిగింది. ఎంక్వైరీ చేసి 20 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క డాక్టర్ పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమోటాని ప్రశ్నించారు. 4.50 కోట్ల




కుంభకోణం జరగలేదా ఏదో ఒక్కటి ఎంక్వైరీ రిపోర్టును బహిర్గతపర్చాలని డిమాండ్ చేశారు. అలాగే అవినీతి అధికారులు, వైద్యులను సస్పెండ్ చేయాలని, అవినీతికి పాల్పడ్డ నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి

**వేద న్యూస్, శాయంపేట:**



కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం శాయంపేట మండలం మైలారం గ్రామంలో కాంగ్రెస్ బల పరిచిన అభ్యర్థి తో పెద్దకోడపాక కేంద్రంలో నామినేషన్ వేయించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే ప్రజా ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని అన్నారు. నిజాయితీ నిబద్దతతో పనిచేసి, అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలలో కూడా మండలానికి అధిక ప్రాధాన్యత నిచ్చేలా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లా చక్రపాణి ,మామిడిపల్లి సాంబయ్య, డిటి రెడ్డి, అరికెళ్ల సుధాకర్, ఏనుగుల శిరీష, అశోక్ ,కుమారస్వామి ,రవీందర్ ,సదయ్య ,రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల మోసం వల్లే యువకుడు మృతి - కేటీఆర్



**వేద న్యూస్, హైదరాబాద్:**

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసానికి ఒక యువకుడు నిండు ప్రాణం కోల్పోవడం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలుకాకపోవడంతో, ఆ వాగ్దానంపై విశ్వాసం పెట్టుకున్న ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని ఆయన అన్నారు. ఇది ఒక వ్యక్తిగత ఘటన కాకుండా, ప్రభుత్వ వైఫల్యం కారణంగా జరిగిన దారుణమని ఆయన అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికి కుదించడంతో వెనుకబడిన వర్గాలపై ప్రభుత్వం పెద్ద నష్టం మోపిందని కేటీఆర్ మండిపడ్డారు. బీసీలకు నియోజకవర్గంలో, అధికార నిర్మాణంలో సముచిత స్థానం ఇచ్చే బాధ్యత ప్రభుత్వం మీద ఉండగా, అది నిర్వర్తించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఇది రాజకీయ తప్పిదం మాత్రమే కాదు, సామాజిక హత్య అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ, కులగణన నుండి న్యాయస్థానాల్లో నిలబడని జీవోలు వరకు కాంగ్రెస్ వైఖరి చిత్తశుద్ధి లేనిదని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు జరిగిన వాగ్దానాలు అమలులో విఫలమవడమే కాకుండా, బీసీల హక్కులను కబళించే విధంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు హామీలు ఇచ్చి, అధికారంలోకి

వచ్చాక తిరస్కరించడం ప్రజా స్వామ్యానికి అవమానమని అన్నారు. బాధితుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబంతో మానవీయంగా వ్యవహరించి, ఆ కుటుంబాన్ని ఆదుకో వడానికి చర్యలు తీసుకోవాలని ఆయ న కోరారు. బీసీల



సమస్యలను చిన్న చూపు చూడకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిం చడాన్ని ఆపాలని ప్రభుత్వం గుర్తిం చాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో జనసైనికులు

- జనసేన బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని వేడుకోలు
- క్యాంపెయిన్‌లో దూసుకెళ్తున్న సర్పంచ్ అభ్యర్థి కాసురి మమత

**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**



కమలాపూర్ మండలం మర్రి పల్లిగూడెంలో సిఐఎస్ఎఫ్ జవా ను భార్య కాసురి మమత స్థాని క సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో తనకు కేటాయిం చిన కత్తెర గుర్తుకు ఓటు వేయాలని, జనసే న కార్యకర్తల సహకారంతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. దేశ సేవకోసం తన భర్త సీఐఎస్ఎఫ్ జవానుగా విధులు నిర్వ హిస్తున్నాడనీ, గ్రామ సేవ కోసం తాను సర్పంచ్ బరిలో నిలి చానని,ప్రచారంలో ప్రజలు,పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ప్రేమతో ఆదరిస్తున్నారని,సర్పంచ్ గా ఎన్నికల్లో గెలిచాక చేపట్టబోయే పనులను వివరిస్తున్నారు.ప్రచారం సాగుతుండటంతో జనసేన శ్రేణు ల్లో నూతనోత్సాహం నెలకొంది.

# బీఆర్ఎస్ నాయకుడి ముందస్తు అరెస్టు



**వేద న్యూస్,శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలో తహరాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివను నర్సంపేట నియోజకవర్గం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన లో భాగంగా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి శాయంపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు .ఈ సందర్భంగా బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు రాక్షస పాలన నడుస్తుందని బి ఆర్ఎస్ పార్టీ విద్యార్థి యువజన నాయకులను అరెస్టులు చేయడం సరైనదికాదు అన్నారు.ఇది రాష్ట్రంలో నిరంకుశ పాలనకు నిదర్శనమని రాబోయే మూడేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమని రాష్ట్రంలో ఎక్కడికి అక్కడ అభివృద్ధి ఆగిపోయిందని కెసిఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్ర బాగానా నిలిపారని ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవని వారు గుర్తుచేశారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

**- ఎస్పి. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**



**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలను పాటించాలి మూడో విడత చివరి రోజు స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. మూడో విడతలో భాగంగా నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న గ్రామ పంచాయతీలు, వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో నిబంధనలు అమల్లో ఉంటాయని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో అనవసర గొడవలు, అవాంఛనీయ చర్యలకు పాల్పడే వ్యక్తులపై ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అభ్యర్థులు మరియు వారి అనుయాయులు ఎన్నికల ప్రవర్తనా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, కూల్చారం ఎసై హమ్మద్ మోహినొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

# ‘ఓగుల’ వైపు కాట్నపల్లి ప్రజల మొగ్గు

- ప్రజాసేవే లక్ష్యంగా సేవా మార్గంలో పూజ రాజేందర్
- కాట్నపల్లి గ్రామ అభివృద్ధియే ధ్యేయం: సర్పంచ్ అభ్యర్థి పూజ



**వేద న్యూస్, సుల్తానాబాద్:**

కష్టం విలువ తెలిసిన వ్యక్తి ఆయన.. చిన్న నాటి నుంచి పేదరికం అనుభవించిన ఓగుల రాజేందర్.. సమాజంలో సేవాభావం పెంపొందాలని కోరుతూ.. ఆ మార్గంలో ముందుకెళ్లే సద్భావన కలిగిన యువకుడు. ఈ క్రమంలోనే సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ సర్పంచ్ బరిలో అభ్యర్థిగా ఆయన సతీమణి పూజను నిలిపారు. వారిరువురు ప్రజాసేవలో తమ వంతు పాత్ర పోషించేందుకు నడుం బిగించారు. తనను ఆశీర్వదించి.. అవకాశమిస్తే.. అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ అభ్యర్థి ఓగుల పూజ రాజేందర్ వెల్లడించారు.

**యువత కు అవకాశమివ్వాలి**

నేటి సమాజంలో యువతకు అవకాశమిస్తేనే.. వారి ఆలోచనలు, ఆచరణ ఎలా ఉంటుందో తెలిసే అవకాశముంటుందని, ఈ నేపథ్యంలోనే తనకు గ్రామ సర్పంచ్‌గా అవకాశమివ్వాలని సర్పంచ్ అభ్యర్థి పూజ కోరుతున్నారు. విద్యావంతులు, సమాజంలో సేవాభావం పెంపొందించేందుకు, నిజమైన ప్రజా సేవలో ముందుకెళ్లాలనే భావన కలిగిన తమకు అవకాశమిస్తే.. తాము ఎలా పని చేస్తామో.. చేసి చూపిస్తామని ఓగుల పూజ రాజేందర్ తెలిపారు. కాట్నపల్లి గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా తమ అడుగులు ఉంటాయని, అవినీతికి తావు లేకుండా పరిపాలన అందిస్తామని హామీనిస్తున్నారు. తాము పేదరికం నుంచి వచ్చిన వారమని, పేదరికం విలువ తెలిసిన మనుషులం కాబట్టి.. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు .. చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం దృష్టికి, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఏ విషయాన్ని అయినా తీసుకెళ్లే చొరవ, శక్తి సామర్థ్యాలు తమకు ఉన్నాయని చెప్పారు. తమను కాట్నపల్లి గ్రామ ప్రజలు నిండుగా, మెండుగా ఆశీర్వదించి.. ఓటు రూపంలో తమ దీవెనలు అందించి.. సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలపించాలని ఓగుల పూజ రాజేందర్ కాట్నపల్లి గ్రామ ప్రజలను వినమ్రంగా వేడుకుంటున్నారు.

# జమ్మికుంటలో రికార్డింగ్ స్టూడియో ప్రారంభం



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల కేంద్రంలో శ్రావణ్ రికార్డింగ్ స్టూడియో ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ పుల్లా శ్రీలత మీడియాతో మాట్లాడుతూ ..జమ్మికుంట పట్టణ, పరిసరాల ప్రాంత ప్రజల సౌకర్యార్థం అట్టహాసంగా, అత్యంత నూతన పరికరాలతో నేడు జమ్మి కుంట బస్టాండ్ ఆవరణలో శ్రావణ్ రికార్డిం గ్ స్టూడియో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఇకపై రికార్డింగ్ కొరకు దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదని, అత్యంత మెరుగైన పరికరాలతో రికార్డింగ్ స్టూడియో ను అందుబాటులోకి తీసుకోవచ్చామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, జడ్పిటిసి, కౌన్సిలర్ అభ్యర్థుల పేర్లపై పాటలు రికార్డ్ చేసి ఇవ్వబడును అని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓల్లాల వాణి తోపాటు ప్రముఖ గాయకులు దండేపల్లి రాజు, సతీష్, శ్రీధర్, అర్చన సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆవాసంలో ఘనంగా వరల్డ్ సాయిల్ డే






**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధి కేశవపురంలోని శ్రీవిద్యారణ్య ఆవాసం విద్యాలయంలో విద్యార్థులు శుక్రవారం వరల్డ్ సాయిల్ డే(ప్రపంచ మృత్తికా దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ డే ప్రాముఖ్యతను విద్యార్థులు క్లాస్ రూంలో ప్రజెంటేషన్ రూపంలో మిగతా తమ తోటి విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పారు. దాంతో పాటు ప్రాక్టికల్‌గా క్షేత్రస్థాయిలో మృత్తిక( సాయిల్)ను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలోని పొలం వద్దకు వెళ్లి విద్యార్థినీ విద్యార్థులు సాయిల్ టెస్ట్ చేశారు. మానవ జీవితంలో మృత్తికలు పోషించే పాత్రను ప్రాక్టికల్‌గా తెలుసుకున్నారు. పర్యావరణ వ్యవస్థలో నేలలు పోషించే పాత్రను విద్యార్థులు ఆచార్యలు తెలియజేశారు. అమూల్యమైన వనరు అయిన నేలను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించడం కోసం డిసెంబర్ 5న ప్రపంచ మృత్తికా దినోత్సవం(వరల్డ్ సాయిల్ డే)ను జరుపుకుంటామని ఆచార్యలు విద్యార్థులకు వివరించారు.

# సాయి చారి మృతి పట్ల బీసీ ఆజాది ఫెడరేషన్ తీవ్ర సంతాపం



**వేద న్యూస్, శంకరపట్నం :**

బీసీ హక్కుల కోసం, ప్రభుత్వం హామీ ఇచ్చిన 42శాతం రిజర్వేషన్ అమలు పై,రాజకీయ పార్టీల మోసాలకు నిరసనగా సాయి చారి తమ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన మృతి పట్ల శంకరపట్నం మండల కేంద్రంలో బీసీ ఆజాది ఫెడరేషన్ తరపున తీవ్ర సంతాపం ప్రకటించి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం, బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం గత రెండు సంవత్సరాలుగా అనేక ధర్నాలు,రాస్తారోకోలు, బందుల వంటి అనేక సభలు నిర్వహిస్తూ, ప్రభుత్వానికి తమ గోడును వెల్లబోసుకున్న కూడా వెల్లబోసుకున్న ఇటు ప్రభుత్వాలు, అటు రాజకీయ పార్టీలు బీసీ ఉద్యమంను పెడచెవిన పెడుతున్నాయని, ఎంత ఉద్యమాలు చేసిన చివరికి నిరాశే మిగిలిందని ఆయన తీవ్ర ఆవేదనకు గురైనాడు.ఈ క్రమంలో సాయి చారి సహితం ఆవేదనకు గురై ఒంటిపై పెట్రోల్ పోసుకొని తగలబెట్టుకుని శరీరమంతా అగ్నికి ఆహుతిగా ఇచ్చినాడని, అతని మరణం వృధా కాకుండా బీసీల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామని అన్నారు.అసలు బీసీల ప్రాణత్యాగాలు, పోరాటాలు ప్రభుత్వాలకు కనబడడం లేదా?అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా మండల అధ్యక్షులు అభిలాష్ గౌడ్ మాట్లాడుతూ,తెలంగాణ ఉద్యమం కోసం ప్రాణాలర్పించి, పోరాటాలు చేసింది బీసీలు కదా?అని అన్నాడు. ఆనాడు శ్రీకాంతాచారి మరణం తెలంగాణ ఉద్యమాన్ని తట్టి లేపితే, నేడు సాయి చారి మరణం కూడా బీసీల పోరాటాన్ని రాష్ట్రమంతా అగ్నిగుండమై రగిలిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు తిరుపతి,గోడిశాల సదానందం గౌడ్,వంగ శ్రీనివాస్, అజ్మద్, ప్రణదీప్, కిరణ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకి ఘన స్వాగతం పలికిన డిసిసి ప్రెసిడెంట్ అయూబ్



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలు మరియు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రారంభోత్సవాలకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని వరంగల్ డిసిసి ప్రెసిడెంట్ అయూబ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజలతో కలిసి పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలికి సన్మానం




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ రామన్నపేట లోని డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల దినోత్సవం పురస్కరించుకొని హనుమకొండ ప్రాంత నివాసులైన డాక్టర్ .కే .అనిత రెడ్డి నీ మా ట్రస్ట్ చే వారి గృహమునందు ఘనంగా శాలువా మొక్కతో సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్. అనిత రెడ్డి దాదాపు 25 సంవత్సరాల నుండి చేస్తున్నటువంటి వారి కార్యక్రమాలను వారు చిన్న పిల్లల పట్ల, వృద్ధుల పట్ల అలాగే బదిరిలు మరియు వికలాంగుల పట్ల అందని క్రోడీకరించి వారు చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహకంలో భాగంగా వారిని సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా అనిత రెడ్డి మాట్లాడుతూ మమ్మల్ని ట్రస్ట్ వారు మా మీద ఉన్న నమ్మకాన్ని నిలుపుతూ నన్ను సన్మానించడం చాలా సంతోషకరమైన అన్నారు. ఇలా చేయడమనేది నన్ను ప్రోత్సహిస్తూ నా బాధ్యతను పెంపొందించిన వారైనారని అన్నారు. అలాగే ట్రస్ట్ వారు చేస్తున్నటువంటి స్వచ్ఛంద కార్యక్రమాలను నేను వీక్షించి దానిపట్ల కూడా సంతోషం వెలిబుచ్చడం జరిగింది. భగవంతుడు వీరికి ఆయురారోగ్యాలు ఇచ్చి, దానితో పాటు సంపాదన కూడా ఇచ్చి ఇంకా ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఎ రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్ , సభ్యులు సత్యనారాయణ , రాఘవ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# ఏసీబీ వలలో అదనపు కలెక్టర్..!



**వేద న్యూస్, హనుమకొండ :**

హనుమకొండ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఏసీబీ వలలో చిక్కారు. రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయారు. హనుమకొండ జిల్లా ఇన్చార్జి డీఈవోగానూ వెంకట్ రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్ కోసం లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. వెంకట్ రెడ్డి తో పాటు జూనియర్ అసిస్టెంట్ మనోజ్ ను సైతం ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# ఎన్నికల కోసం బ్యాలెట్ బాక్సుల భద్రపరిచివేత



**వేద న్యూస్, కాసిపేట:**


మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాసిపేట మండలానికి కేటాయించిన 228 బిగ్ బ్యాలెట్ బాక్సులను శుక్రవారం పోలీస్ బందోబస్తుతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాసిపేట వద్దకు తరలించి భద్రపరిచారు. బాక్సులను సురక్షితంగా ఉంచుతూ అధికారుల సమక్షంలో సీల్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఈఈ రాజశేఖర్ పోలీస్ సిబ్బందితో కలిసి బ్యాలెట్ బాక్సులను తీసు కొచ్చి, వాటిని మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ కి అధికారికంగా అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు లక్ష్మీ నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. రాబోయే సర్పంచ్/వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

వేద న్యూస్

శనివారం డిసెంబర్ 06, 2025

# గంభీర్ జాగ్రత్తగా ఉండాలి

## - రోహిత్, కోహ్లీతో పెట్టుకుంటే ప్రళయం తప్పదు - రవిశాస్త్రి



**వేద న్యూస్ డెస్క్:**

టీమిండియా దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై ఇటీవల వస్తున్న టాక్సిక్ వివాదాలకు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి గట్టిగా బ్రేక్ వేశాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌ఈ ఇద్దరితో అనవసరంగా సంఘర్షణలకు దిగితే అతి పెద్ద తప్పు అవుతుందని హెచ్చరించాడు. వారు చిర్రెత్తుకుంటే పరిస్థితి ఎంత దారుణంగా మారుతుందో అందరికీ తెలుసని శాస్త్రి తనదైన శైలిలో స్పష్టం చేశాడు. కోహ్లీ, రోహిత్ ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పి వన్డేల్లోనే కొనసాగుతున్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని మళ్లీ తమ బెస్ట్ ఫామ్ బయటపెడుతున్నారు. వరుస సెంచరీలు, భారీ స్కోర్లతో తమ క్లాస్‌ను మరోసారి నిరూపిస్తున్నారు. అయినప్పటికీ జట్టులో వారి భవిష్యత్తుపై అనుమానాలు, కోచ్ గంభీర్‌తో విభేదాలు ఉన్నాయనే వార్తలు ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రవిశాస్త్రి బహిరంగంగా మాట్లాడాడు. “కొహ్లీ, రోహిత్ ఆటలో తాతలు వాళ్లు చేసే పనిని ఎవ్వరూ చేయలేరు. ఒకరు ఛేజింగ్ కింగ్%ొ% మరొకరు మూడు వన్డే డబుల్ సెంచరీలు కొట్టిన వింత ప్రతిభ. ఇలాంటి వారితో అనవసరంగా పెట్టుకోవద్దు. వాళ్లకు చిర్రెత్తితే ముందు దెబ్బతినేది జట్టే అవుతుంది” అని శాస్త్రి ఘాటుగా వ్యాఖ్యానించాడు. అంతేకాదు, అనుభవాన్ని మార్కెట్‌లో కొనలేమని, ప్రపంచం మొత్తం గౌరవించే ఇద్దరు లెజెండ్లను వ్యక్తిగత అజెండాలకు బలి చేయరాదని గంభీర్‌కు పరోక్షంగా హెచ్చరిక పంపించాడు. మరోవైపు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా ఇదే అంశంపై స్పందించాడు. నేరుగా పేర్లు చెప్పకపోయినా గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌లపై బాంబులు పేల్చాడు. “ఏం సాధించని కొందరు%ొ% గొప్ప ఘనతలు సాధించిన ఆటగాళ్ల భవిష్యత్తును నిర్ణయించడం చాలా దురదృష్టకరం. నా కెరీర్‌లోనూ జరిగిందే ఇప్పుడూ కోహ్లీ, రోహిత్ పరిస్థితి. టాలెంట్ ఉన్నా, ప్రదర్శన ఇస్తున్నా అవకాశాలు ఇవ్వకపోవడం తప్పు” అని భజ్జీ వ్యాఖ్యానించాడు. కోహ్లీ, రోహిత్ మళ్లీ టాప్ ఫామ్‌లో ఉన్న ఈ దశలో అనవసర వివాదాల వల్ల జట్టు వాతావరణం దెబ్బతింటుందని క్రికెట్ వర్గాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఒకే మాట చెబుతున్నారు “రో-కోతో ఆట కాదు వాళ్లతో పెట్టుకుంటే ఎవరు వచ్చినా తానే కష్టాల్లో పడతారు.

# ప్రపంచంలో అత్యధికంగా వెతికిన క్రీడా స్టార్లు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా క్రీడా రంగంలో ప్రతి రోజూ కొత్త కొత్త రికార్డులు, సంచలనాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది ఇంటర్నెట్‌లో అత్యధికంగా వెతికిన క్రీడాకారుల జాబితా ఆసక్తికరంగా మారింది. తాజా విశ్లేషణల ప్రకారం, ప్రపంచ సెర్చ్‌లలో పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం 76 దేశాల్లో అతనిపైనే అత్యధిక సెర్చ్‌లు జరగడం అతని గ్లోబల్ క్రేజ్‌కి నిదర్శనం. స్పెయిన్‌కు చెందిన 18 ఏళ్ల ఫుట్‌బాల్ ప్రతిభావంతుడు లమిన్ యమాల్ ఈ జాబితాలో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. మొత్తం 37 దేశాల్లో అతని పేరు అత్యధికంగా వెతికారు. తరువాత 16 దేశాలతో లియోనల్ మెస్సీ మూడో స్థానంలో నిలవడం విశేషం. అమెరికా టెన్నిస్ తార కోకో గాఫ్ ఎనిమిది దేశాల సెర్చ్‌లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఫార్ములా%-%1 రేసింగ్ ఛాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఆరు దేశాల సెర్చ్‌లతో ఐదో స్థానంలో నిలిచాడు. నెలవారీ సెర్చ్‌ల పరంగా రొనాల్డో దూసుకెళ్లాడు. నెలకు 13.6 మిలియన్ సెర్చ్‌లతో అతడే టాప్‌లో నిలిచాడు. జానిక్ సిన్నర్, కార్లోస్ అల్కరాజ్, లమిన్ యమాల్‌లకు సగటున నెలకు 9.14 మిలియన్ సెర్చ్‌లు నమోదయ్యాయి. భారత్ విషయానికి వస్తే దేశంలో అత్యధికంగా వెతికిన క్రీడాకారుడు ఎవరు అంటే సందేహమే లేదు ౦ విరాట్ కోహ్లీ! గ్లోబల్ స్టార్ల కంటే కూడా భారత్‌లో కోహ్లీకే అతిపెద్ద క్రేజ్ ఉన్నట్లు సెర్చ్ వివరాలు చెబుతున్నాయి.



కోహ్లీ తర్వాత 14 ఏళ్ల చిన్న వయస్కుడు వైభవ్ సూర్యవంశీ నిలవడం ఆశ్చర్యం కలిగించే అంశమే. విధ్వంసకర బ్యాటింగ్‌తో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన అతని ఇన్నింగ్స్ సెర్చ్‌లను ఆకాశానికి ఎత్తింది. మహిళా క్రికెటర్లలో జెమీమా రోడ్రిగ్స్, స్మృతి మంధాన పేర్లు వరుస స్థానాల్లో నిలిచాయి. మహిళల వన్డే ప్రపంచకప్ విజయం ఈ ఇద్దరి ప్రసిద్ధిని ఇంకాస్త పెంచింది. ఈ లిస్ట్ గూగుల్ అధికారికంగా ప్రకటించకపోయినా, నెలాఖరులో పూర్తి వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్

## - షఫాలీ వర్మ నామినేట్

**వేద న్యూస్ డెస్క్:**



మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో టీమిండియాకు విశ్వవిజయం అందించిన శఫాలీ వర్మ ఇప్పుడు గ్లోబల్ గుర్తింపు దిశగా అడుగులు వేసింది. ఆమెను ఐసీసీ నవంబర్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు అధికారికంగా నామినేట్ చేసింది. అకస్మాత్తుగా జట్టులోకి వచ్చి, అటు బ్యాటింగ్‌తోనూ, ఇటు బౌలింగ్‌తోనూ మ్యాజిక్ చూపిన శఫాలీ ప్రదర్శనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తోంది. ప్రతికా రావల్ సెమీ ఫైనల్‌కు ముందు గాయపడటంతో జట్టులోకి వచ్చిన శఫాలీ తొలిపోటీలో విఫలమైనా ఫైనల్‌లో మాత్రం అసలైన టాలెంట్ చూపించింది. సౌతాఫ్రికాతో టైటిల్ మ్యాచ్‌లో 78 బంతుల్లో 87 పరుగులు చేసి భారత్‌కు బలమైన పునాది వేసింది. అంతేకాదు, కెప్టెన్ హర్మన్ ప్రీత్ అనూహ్యంగా బౌలింగ్ బాధ్యత ఇస్తే రెండు కీలక వికెట్లను పడగొట్టి మ్యాచ్‌ను కీలక మలుపులోకి తీసుకెళ్లింది. ఈ అవార్డు కోసం శఫాలీతో పాటు యూఏఈ ఆల్‌రౌండర్ ఈషా ఓజా, థాయ్‌లాండ్ స్పిన్నర్ తిపట్చా పుట్టావాంగ్ కూడా రేసులో ఉన్నారు.

# రో - కో పోటీకి సిద్ధం




**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్ డిసెంబర్ 6తో ముగియనున్న నేపథ్యంలో టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భారత్‌కు తిరిగి వచ్చి దేశీయ వేదికపై మళ్లీ ప్రత్యేక లోకల్ రైవల్రీని రాబోతున్నారు. డిసెంబర్ 24 నుంచి ప్రారంభమయ్యే విజయ్ హజారే ట్రోఫీ-2025లో ఈ ఇద్దరు దిగ్గజాలు ప్రత్యర్థులుగా బరిలోకి దిగబోతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.విరాట్ కోహ్లీ ఢిల్లీ తరపున ఆడుతుండగా, రోహిత్ శర్మ ముంబై తరపున రంగంలోకి దిగబోతున్నాడు. ఈ ఇద్దరు ఎంత మ్యాచ్‌లు ఆడతారో స్పష్టత లేకపోయినా, న్యూజిలాండ్ సిరీస్ వరకు దేశీయ క్రికెట్‌లో కొనసాగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి.

# త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం

## ‘అఖండ 2’ వాయిదాపై సురేష్ బాబు స్పష్టం

**వేద న్యూస్ డెస్క్:**



నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో భారీ అంచనాల నడుమ తెరకెక్కిన ‘అఖండ 2’ విడుదల వాయిదా పడటం టాలీవుడ్ మొత్తాన్ని ఆశ్చర్యపరిచింది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సిన ఈ చిత్రం, చివరి నిమిషంలో నిలిచిపోయింది. ప్రీమియర్ షోలు రద్దు, టికెట్ బుకింగ్స్ స్టాప్ ఒక్కసారిగా ఏర్పడిన ఈ పరిస్థితి అభిమానుల్లో ఆవేదన కలిగించింది. సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. ఆర్థిక వివాదాలు, లీగల్ ఇష్యూలు, పెండింగ్ బకాయిలు ఇలా అనేక కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్ అగ్ర నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సురేష్ బాబు ఈ వివాదంపై స్పష్టతనిచ్చారు. ఒక సినీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సమస్యలన్నీ అంతర్గత ఆర్థిక లావాదేవీలకు సంబంధించినవేనని, వాటిని బయటకు చెప్పడం తగదని తెలిపారు. “నేను కూడా ఈ సమస్యపై మాట్లాడటానికే వెళ్లాను. ‘అఖండ 2’ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది. ఇది పూర్తిగా ఆర్థికపరమైన ఇష్యూ. ఇవి ప్రజల్లో చర్చకు వచ్చే అంశాలు కావు,” అని చెప్పారు. సినిమా విడుదలను నిలిపేసిన ఆర్థిక సమస్యలపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను కఠినంగా ఖండించిన సురేష్ బాబు, “ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు కోట్ల రూపాయల గురించి రాస్తున్నారు. అసలు లేని విషయాలను ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ అనవసరపు ప్రస్తావనలు. అసలు విషయం బయటకు చెప్పకూడని పరిస్థితుల్లో ఉంది,” అని స్పష్టం చేశారు. అభిమానులు, ప్రేక్షకులు ఎదురుచూస్తున్న ‘అఖండ 2’ విడుదలపై ఆశాజనక సంకేతాలు ఇస్తూ సురేష్ బాబు, “ఇది తాత్కాలిక అంతరాయం మాత్రమే. సమస్యలు త్వరగా క్లియర్ అవుతాయి. సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుంది,” అని ధృవీకరించారు. ఇక అభిమానులు మాత్రం “ఎప్పుడెప్పుడు మా బాలయ్య మాస్ విజృంభణ చూస్తామా?” అంటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ‘అఖండ 2’ వాయిదా వెనుకున్న వాస్తవాలపై వచ్చిన స్పష్టతతో, ఇప్పుడు అందరి చూపు కొత్త విడుదల తేదీపై నిలిచింది.

# జపాన్‌లో ప్రభాస్ సెన్సేషన్

## - కొత్త లుక్‌తో బాహుబలి మేనియా మళ్లీ రాజుకుంది



**వేద న్యూస్ డెస్క్:**

పాన్ - ఇండియా స్టార్ ప్రభాస్ జపాన్‌లో మరోసారి తన గ్లోబల్ క్రేజ్‌ను నిరూపించాడు. అక్కడ జరిగిన ‘బాహుబలి: ది ఎపిక్’ ప్రత్యేక ప్రదర్శనకు హాజరైన ప్రభాస్‌ను చూడటానికి జపనీస్ అభిమానులు వేల సంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఆయన అక్కడ కనిపించిన వెంటనే వేదిక మొత్తం ఉత్సాహంతో నిండిపోయింది. థియేటర్ నుంచి బయటకు వచ్చే వరకూ సెల్ఫీల కోరికలు, సంతకాల జాబితాలు, అభిమానుల అరుపులు మొత్తం వాతావరణం సెలబ్రేషన్‌లా మారిపోయింది. ఈ స్క్రీనింగ్‌లో ప్రభాస్ కనిపించిన కొత్త లుక్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇంతకుముందు కనిపించని స్మార్ట్, స్టైలిష్, స్లిమ్ లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఫోటోలు, వీడియోలు కొద్ది నిమిషాల్లోనే జపాన్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అక్కడి అభిమానులతో ఆప్యాయంగా మాట్లాడటం, గిఫ్టులు స్వీకరించడం, సిగ్నేచర్లు ఇవ్వడం%ొ% ప్రతీ క్షణం జపాన్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ప్రభాస్ తాజా లుక్ చూసిన అభిమానులు ఇది ఆయన నటిస్తున్న కొత్త సినిమాల్లో ఏదో ఒకటి కోసం అయి ఉండొచ్చని భావిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న స్పిరిట్ సినిమా కోసం ఈ రగ్గడ్, ఇంటెన్స్ లుక్ అయి ఉంటుందని చాలా మంది అంటున్నారు. మరోవైపు హను రాఘవపూడి తీస్తున్న సైనిక నేపథ్య చిత్రం ఫౌజీ కోసం కూడా ఈ లుక్ కావొచ్చని చర్చ సాగుతోంది. ఏ సినిమా కోసం అయితేనేం, ప్రభాస్ లుక్ మాత్రం ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో భారీ హైప్‌కి కారణమైంది. ఇటీవల ఇండియాలో విడుదలైన బాహుబలి: ది ఎపిక్ (బాహుబలి 1, 2 భాగాలను ఒకే కథనంగా కట్‌చేసిన వెర్షన్) మంచి స్పందన అందుకుంది. అదే చిత్రాన్ని జపాన్‌లో ప్రత్యేక ప్రదర్శనగా చూపించడం వల్ల అక్కడ కూడా మరోసారి బాహుబలి క్రేజ్ పీక్‌కి చేరింది. ప్రభాస్ అక్కడ కనిపించడంతో ఆ మేనియా రెట్టింపు అయింది. ప్రభాస్ కొత్త లుక్‌కు అభిమానుల రియాక్షన్లు చూస్తే “డార్లింగ్ ఫైర్”, “స్క్రీన్‌పై ఇలా కనిపిస్తే రికార్డులు కూలిపోతాయి”, “ప్రభాస్ గ్లోబల్ స్టార్ కాదు గ్లోబల్ ఫెనామినాన్” అంటూ కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. ప్రభాస్ జపాన్ సందర్శనతో మరోసారి నిరూపితమైందిఇండియా మాత్రమే కాదు, ప్రపంచం మొత్తం డార్లింగ్‌కు ప్రేమలో పడిపోయిందని.

# ఇండిగో గందరగోళంపై నటి మెహ్రీన్ తీవ్ర ఆవేదన

**వేద న్యూస్ డెస్క్:**



దేశంలో అతిపెద్ద ఎయిర్‌లైన్‌గా గుర్తింపు పొందిన ఇండిగో గత నాలుగు రోజులుగా నిర్వహణపరమైన లోపాల కారణంగా భారీ విమాన రద్దులతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. గురువారం ఒక్కరోజే 550 విమానాలను రద్దు చేసిన ఇండిగో, శుక్రవారం కూడా దాదాపు 400 ఫ్లైట్లను రద్దు చేయడంతో ప్రయాణికులు పెద్ద ఎత్తున విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. దేశవ్యాప్తంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విమానాశ్రయాల వద్ద నెలకొన్న గందరగోళంఈ అన్ని ఘటనలపై నటి మెహ్రీన్ పిర్జాదా తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో మెహ్రీన్ చేసిన పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఆగ్రహంతో స్పందించిన ఆమె, ఇండిగో యాప్ విమానాలు ‘సమయానికి’ ఉన్నట్లు చూపించి చివరి నిమిషంలో రద్దు చేయడం ప్రయాణికుల జీవితాలను పూర్తిగా అవస్థలు పెట్టే చర్య అని పేర్కొంది. మూడు, నాలుగు రోజులుగా విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయిన ప్రయాణికుల దుస్థితిని ప్రస్తావిస్తూ, ఇది సాంకేతిక లోపం కాదనిస్పష్టమైన నిర్లక్ష్యమని ఆమె కఠినంగా వ్యాఖ్యానించింది. డీజీసీఏ కొత్త నియమాలు అమల్లో ఉన్నా, ఇండిగో వాటిని పట్టించుకోకుండా ప్రయాణికులకు తప్పుదారి చూపిస్తోందని మెహ్రీన్ ఆరోపించింది. ముందుగా షెడ్యూళ్లను సరిచేయాల్సిన సంస్థ, ప్రజలను తెలియని పరిస్థితుల్లో వదిలేయడం దారుణమని పేర్కొంది. “మీ తప్పును అంగీకరించండి, ఏమి జరుగుతోందో స్పష్టంగా చెప్పండి, చిక్కుకుపోయిన ప్రయాణికులకు తక్షణం నష్టపరిహారం చెల్లించండి” అని మెహ్రీన్ డిమాండ్ చేసింది. ఇండిగో ఇప్పటివరకు పూర్తి వివరణ ఇవ్వకుండా ఉండటంపై కూడా విమర్శలు పెరుగుతుండగా, ప్రయాణికుల ఆవేదన రోజురోజుకూ తీవ్రతరం అవుతోంది. విమాన రద్దులు ఇంకా ఎంతకాలం కొనసాగుతాయో స్పష్టత లేకపోవడంతో ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితి మరింత క్లిష్టమవుతోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073